క్లుప్తంగా

గణనాథుడికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న కోలా గురువులు

కొమ్మాది: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బీచ్ రోడ్డు మంగమారిపేట యూత్ బాయ్స్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పాల్గొన్నారు. అనంతరం మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున యువకులు, స్థానికులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



శాంతి ర్యాలీ చేస్తున్న ముస్లింలు

భీమునిపట్నం: భీమిలి జామియా మసీద్ వద్ద సోమవారం మహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం మసీద్ పెద్దలు, ముస్లింల ఆధ్వర్యంలో చిన్నబజారు, మెయిన్ రోడ్డు, పెద్దబజారు ప్రాంతాల్లో శాంతి ర్యాలీ చేశారు.

క్రీడా పోటీల్లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



ట్రోఫీ అందుకుంటున్న భీమిలి కేజీబీవీ విద్యార్థినులు

భీమునిపట్నం: భీమిలి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం(కేజీబీవీ) విద్యార్థినులు కర్నూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఆటియా-పాటియా క్రీడా పోటీల్లో ప్రతిభ చూపారు. 9, 10, ఇంటర్మీడియట్ విద్యార్థినులు పాల్గొని చక్కగా ఆడి ద్వితీయ స్థానంలో నిలిచి ట్రోఫీ అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం విద్యాలయం వద్ద వీరిని ప్రిన్సిపాల్ గంగాకుమారి, సిబ్బంది అభినందించారు.

పర్యావరణ పరిరక్షకులకు సత్కారం



మిషన్ గ్రీన్ భీమిలి సభ్యులు ఆదిత్య, వెంకటేష్‌ను సత్కరిస్తున్న ఫ్యాబ్ సభ్యులు

భీమునిపట్నం: భీమిలి పరిధిలో పర్యావరణాన్ని పరిరక్షించడంలో తమ వంతు కృషి చేస్తున్న మిషన్ గ్రీన్ భీమిలి వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులను సోమవారం స్థానిక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి(ఫ్యాబ్) సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా ఫ్యాబ్ ప్రతినిధి ముసునూరి సూర్యశ్రీనివాస్ మాట్లాడుతూ మిషన్ గ్రీన్ సభ్యులు ముమ్మిడిశెట్టి ఆదిత్య, గుల్లల వెంకటేష్ భీమిలి చుట్టుపక్కల ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించడానికి చేస్తున్న కృషి ఎంతో గొప్పదన్నారు. కోటి విత్తనాలను లక్ష సీడ్ బాల్స్ ద్వారా కొండవాలు ప్రాంతాల్లో చల్లించే కార్యక్రమాన్ని చేపట్టారని, దీనికి భారత నావికాదళం ముందుకొచ్చి కొద్ది రోజుల కిందట హెలికాప్టర్‌ల ద్వారా ఎయిర్ సీడింగ్ కార్యక్రమం నిర్వహించిందని పేర్కొన్నారు. ఫ్యాబ్ సభ్యులు కాళ్ల సన్నీ, కట్టమూరి అశోక్, పెంటపల్లి దేవానంద్, కట్టమూరి రమణారావు, కందివలస నరేంద్ర, బలభద్రుని బంగారురాజు, ఎన్.శ్రీను పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

దాబాగార్డెన్స్: గత 3 రోజులుగా కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఉదయం 8 నుంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పవిత్ర అవరోహణం, మహా పూర్ణాహుతి, ఆశీర్వచనం జరిపారు. ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

జుగుప్సాకరంగా గోస్తనీ తీరం

- మూసేసిన మేకల కబేళా వద్ద పశువుల వధ
- కలుషితమవుతున్న పరిసరాలు
- జాతీయ రహదారి పక్కన, శ్మశానవాటికలోనూ మాంస వ్యర్థాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు



మూసేసిన కబేళా పక్కన పశువుల వ్యర్థాలు

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట నుంచి గోస్తనీనది తీరానికి వెళ్లే వారు అక్కడ కనిపించే పశువుల మాంస వ్యర్థాలు, రక్తపు చారికలు, ఎముకల గూళ్లు చూసి జడుసుకుంటున్నారు. జుగుప్సాకరమైన ఈ వాతావరణాన్ని చూసిన వారు నది వద్ద పుణ్యకార్యాలు చేసేందుకు కూడా వెనుకాడుతున్నారు. చివరకు పక్కనే ఉన్న శ్మశానవాటికకు కూడా బంధువుల అంతిమయాత్రకు వెళ్లేందుకు సాహసించడం లేదు. ఇక్కడికి సమీపంలో పదేళ్ల క్రితం మూసివేసిన మేకల కబేళాను పశు మాంస వ్యాపారులు అడ్డాగా చేసుకుని బంగ్లామెట్ట శివాలయానికి కేవలం 100 మీటర్ల దూరంలోనే ఈ దందా సాగిస్తున్నారు. పశువుల వధ జరుగుతున్న సమీపంలోనే చాలా వరకు నివాసగృహాలు, ఆలయాలు, బస్టాప్‌లు ఉన్నాయి. సిటీ బస్సు సిబ్బంది ఈ ప్రాంతంలోనే బస్సులు నిలిపి విశ్రాంతి తీసుకుంటుంటారు. సచివాలయానికో శానిటరీ సెక్రటరీ ఉన్నా కలుషితమవుతున్న ఈ ప్రాంతంలో యథేచ్ఛగా జరుగుతున్న పశువుల వధను అడ్డుకోలేకపోతున్నారు. ఈ వ్యవహారంలో టీడీపీ ముఖ్య నాయకులు కీలకపాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వారి కనుసన్నలలోనే పదుల సంఖ్యలో పశువులను ఇక్కడ అక్రమంగా వధించి మాంసాన్ని గోస్తనీ నదిలో శుభ్రం చేసి పక్కనే ఉన్న నెల్లిమర్ల నుంచి ఎగుమతి వ్యాపారం చేస్తున్నారు. పశువులలో పనికిరాని మాంస వ్యర్థాలు, ఖండాలు, రక్తాన్ని వేకువజామున నదిలో కలిపేస్తున్నారు. కేవలం నదీ తీరంలోనే కాకుండా శ్మశానవాటిక, జాతీయ రహదారిపై వంతెనను ఆనుకుని నిత్యం కోళ్లు, మేకలు, పశువుల మాంస వ్యర్థాలు పడేస్తున్నారు. వీటిని ఏరుకోవడానికి ఈ ప్రాంతంలో నిత్యం వందల సంఖ్యలో పక్షులు, కుక్కలు సంచరిస్తున్నాయి.

మొద్దునిద్రలో జీవీఎంసీ మెడికల్ ఆఫీసర్లు

తగరపువలస కేంద్రంగా వందల సంఖ్యలో హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, హాస్టళ్లు, విద్యాసంస్థలు ఉన్నాయి. వీటితోపాటు వేల సంఖ్యలో వినియోగదారులు నిత్యం మాంసాహారం కోసం ప్రైవేట్ మార్కెట్‌కు వస్తారు. భీమిలి జోన్‌లో ఎక్కడా అధికారికంగా మేకల, పశువుల కబేళాలు లేవు. ఇక్కడి మార్కెట్‌లో లేదా రోడ్డు పక్కన మేక, గొర్రె మాంసం అమ్మాలన్నా మధురవాడ కబేళాలోనే వధించాల్సి ఉంటుంది. కానీ జీవీఎంసీ, సచివాలయ అధికారుల అనధికార మేత కారణంగా ఇళ్ల మధ్యలో మేకలను, ఊరి మధ్యలో పశువులను నిత్యం వధిస్తున్నారు. వీటి ఆరోగ్య పరిస్థితి తనిఖీ చేసే పశువైద్య సిబ్బంది లేకపోవడంతో చిన్నపాటి మేకపిల్లలు, గొర్రెపిల్లలు, వ్యాధులతో బాధపడుతున్నవాటిని, పాము, కుక్కకాట్లకు గురై చనిపోయిన వాటిని వధించి మార్కెట్‌లో యథేచ్ఛగా కిలో రూ.900 నుంచి రూ.1000 వరకు విక్రయిస్తున్నారు. ఇక హోటళ్ల ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో మేక, గొర్రెల మాంసానికి బదులు కల్తీ చేసిన పశువుల మాంసాన్ని, ఫారాలలో చనిపోయిన కోళ్లను, కుళ్లిపోయిన కోడిగుడ్లను నూనెలో వేయించి కలర్స్, మసాలా పొడులు వేసి వేడివేడిగా అందించి మాంసాహార ప్రియులను రోగాలపాలు చేస్తున్నారు. వాతావరణం కలుషితమవుతున్నా, ప్రజల ఆరోగ్యంతో వ్యాపారులు చెలగాటమాడుతున్నా జీవీఎంసీ వైద్యాధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. అధికారుల నిఘా లేకపోవడంతో వ్యాపారులు ఆడింది ఆట, పాడింది పాటగా సాగిపోతుంది. ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఇకనైనా జీవీఎంసీ అధికారులు ముందుకు వచ్చి తనిఖీలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అక్రమంగా కబేళా నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకుని గోస్తనీ తీర పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పదేళ్ల కిందట మూసేసిన భీమిలి మున్సిపాల్టీ మేకల కబేళా



మూసేసిన కబేళా పక్కన కుప్పలుగా పశువుల ఎముకుల గూళ్లు



తగరపువలస శ్మశానవాటికలో కోళ్ల మాంస వ్యర్థాలు



జాతీయ రహదారిపై వంతెన సమీపంలో మాంస వ్యర్థాలు

అందరూ హిందీ నేర్చుకోవాలి



గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆదర్శప్రేమీ మండలి విద్యార్థులు

తగరపువలస : దేశ సమగ్రతకు ఉపయోగపడే జాతీయ భాష హిందీని ప్రతి ఒక్కరూ గౌరవించి నేర్చుకోవాలని భీమిలికి చెందిన ఆదర్శ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు అన్నారు. హిందీ భాషా వారోత్సవాల్లో భాగంగా ఆయన సోమవారం గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు హిందీ దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, ఏలూరు రాంబాబు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత



చేబ్రోలులో సరకులతో సువార్త మిత్ర బృందం

తగరపువలస : భీమిలి, తగరపువలస, చిట్టివలస ప్రాంతాలకు చెందిన సువార్త మిత్ర బృందం సోమవారం వరద ప్రభావిత ప్రాంతాల్లో రూ.లక్ష విలువ చేసే బియ్యం, నిత్యావసర సరకులు బాధితులకు పంపిణీ చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని చేబ్రోలు ఎస్సీ పేట, వైఎస్సార్ కాలనీలో వీటిని అందించారు. తగరపువలస నుంచి సరకులను వ్యాన్‌లో తీసుకెళ్లినట్టు సువార్త మిత్ర బృందం ప్రతినిధులు మోజెస్, కృపారావు, దుర్గాప్రసాద్, జీవన్, భీమిలి ప్రసాద్, ఉపాధ్యాయుడు చిన్నారావు, మింటు, అఖిల్ తెలిపారు.


భీమిలి హైస్కూల్ శత వసంతోత్సవాలకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న గాడు అప్పలనాయుడు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల శత వసంతాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్సవ నిర్వహణ కమిటీ అధ్యక్షులు గాడు అప్పలనాయుడు తెలిపారు. సోమవారం నిర్వహించిన కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే డిసెంబర్‌లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సహకారంతో జరగనున్న ఈ ఉత్సవాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, మంత్రి లోకేష్‌లను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. పాఠశాల గొప్పతనంతోపాటు ఈ ప్రాంత ప్రాధాన్యం కూడా అందరికీ తెలియజెప్పేలా ఎంతో వైభవంగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, దీనికి అందరు సహకరించాలని కోరారు. కమిటీ సభ్యులు పూసర్ల శ్రీనివాస్, చౌదరి సత్యారావు, దారపు అప్పారావు, రాజేటి బసవ కృష్ణమూర్తి, వర్మ, కాళ్ల సాయి, ఎచ్చర్ల హరి, ఉమా పట్నాయక్ పాల్గొన్నారు.

● ఏకదంతాయ.. వక్రతుండాయ



ఆదర్శనగర్‌లో కొలువైన విఘ్నాధిపతి



తాటితూరు కూడలిలో 12 అడుగుల గణపతి విగ్రహాన్ని దర్శించుకుంటున్న స్థానికులు

వినాయక చవితి ఉత్సవాలు వాడవాడలా ఘనంగా జరుగుతున్నాయి. వివిధ రూపాల్లో గణనాథుడు మండపాల్లో కొలువై విశేష పూజలందుకుంటున్నాడు. ఏకదంతుడిని భక్తులు కనులారా దర్శించి.. మనసారా పూజించి తరిస్తున్నారు.

\- తగరపువలస



కీటిన్‌పేట శ్రీవిద్యాశక్తి పీఠంలో గరిక, సింధూరంతో స్వామికి అర్చన



బాలాజీనగర్ యాతపేటలో గౌరీపుత్రుడు

ఓజోన్ పరిరక్షణ అందరి బాధ్యత



డైట్‌లో ఓజోన్ డే ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఛాత్రోపాధ్యాయులు

భీమునిపట్నం: మనకు రక్షణగా ఉన్న ఓజోన్ పొర దెబ్బతింటూ వస్తోందని, ఈ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోకపోతే తీవ్ర అనర్థాలను ఎదుర్కోవలసి ఉంటుందని స్థానిక జిల్లా విద్య శిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి అన్నారు. ప్రపంచ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వాతావరణంలో మార్పులు, పచ్చదనం తగ్గిపోవడంతోపాటు మనం వినియోగించే ఏసీలు, ఇతర సాధనాల వల్ల ఓజోన్ పొరకు నష్టం వాటిల్లుతూ వస్తోందన్నారు. అతి నీలలోహిత సూర్యకిరణాల వల్ల చాలా నష్టాలు ఏర్పడుతున్నాయని, దీని ప్రభావం ఇప్పటికే ఎంతో ఎక్కువగా ఉందని చెప్పారు. ఓజోన్ పొరను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత, అవసరం అందరికీ ఉందని, అందులో భాగంగా ఎక్కువగా మొక్కలు, చెట్లను పెంచాలని సూచించారు. అనంతరం ఛాత్రోపాధ్యాయులు ఓజోన్ డే ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ యూ.మాణిక్యం నాయుడు, అధ్యాపకులు ఎల్.సుధాకర్, గొట్టేటి రవి, నాగేశ్వరరావు, మహాలక్ష్మి, సోమయాజులు, త్రినాథరావు, నీలిమ, హరిణి పాల్గొన్నారు.

విజయ గణపతికి 1,100 లడ్డూలతో అర్చన నేడు



గణేష్‌నగర్ విజయ గణపతి ఆలయంలో పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు, అతిథులు

మధురవాడ: వినాయక ఉత్సవాల్లో భాగంగా 5వ వార్డు గణేష్‌నగర్‌లోని శ్రీ విజయ గణపతి పంచాయితన దేవాలయంలో సోమవారం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండ పద్మనాభ శర్మ, నవీన్ శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం, విశేష అలంకరణ చేశారు. మంగళవారం స్వామికి 1,100 లడ్డూలు, గరిక మాలలు సమర్పించి అర్చన చేస్తామని చెప్పారు. భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఆలయ ధర్మకర్త నక్కాన సూర్యప్రకాశరావు, కమిటీ పెద్దలు గడ్డి శ్రీను, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ 5వ వార్డు యువజన విభాగం అధ్యక్షుడు బగాది లక్ష్మణ, అల్లాడ వెంకటరావు, కొర్రాయి సురేష్, సమన్వయ కమిటీ సభ్యుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు పోతిన సన్యాసిరావు



మధురవాడలో పోతిన సన్యాసిరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మధురవాడ : ప్రజల హృదయ నేత, చిరస్మరణీయుడు మాజీ ఎమ్మెల్యే పోతిన సన్యాసిరావు అని వివిధ పార్టీల నాయకులు కొనియాడారు. సోమవారం ఆయన 40వ వర్ధంతిని పురస్కరించుకుని మధురవాడ సీపీఐ కార్యాలయం వద్ద గల విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధురవాడ అభివృద్ధిలో, మౌలిక సదుపాయాల కల్పనలో ఆయన విశేషమైన కృషి చేశారని కొనియాడారు. ముఖ్యంగా మధురవాడ క్వారీ సొసైటీ స్థాపించి అనేక మందికి ఉపాధి కల్పించారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మధురవాడ, ఎండాడ మాజీ సర్పంచ్‌లు కుడితి రామారావు, చెన్నా దాసు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు జేడీ నాయుడు, సీపీఐ ఏరియా సమితి నాయకుడు సత్యనారాయణ, నాయకులు పోతిన శ్రీనివాసరావు, వాండ్రాసి రవికుమార్, మొల్లి లక్ష్మణరావు, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, వాండ్రాసి అప్పలరాజు, పిళ్లా సూరిబాబు, నాగోతి సత్యనారాయణ, నాగోతి శివాజీ, పిళ్లా అప్పన్న పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ విద్యార్థులకు శిక్షణ

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఇటీవల ప్రారంభమైన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) ఉచిత శిక్షణకు సోమవారం నియోజకవర్గంలోని వివిధ జెడ్పీ హైస్కూళ్లలో 8వ తరగతి చదువుతున్న పలువురు విద్యార్థులు హాజరయ్యారు. వీరికి ఉదయం సెషన్స్‌లో ఆనందపురం మండలం వెల్లంకి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు యాగాటి వెంకటరమణ మెలకువలు నేర్పించారు. అనంతరం మరో ఉపాధ్యాయుడు దత్తి రవి సోషల్, ఎస్.ఎ.శ్రీను గణితం, పక్కి నాగేశ్వరరావు ఫిజిక్స్ బోధించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఫెండ్స్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, చిట్టివలస జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు అభినందించారు.

విశేషంగా అన్నసమారాధనలు



గణేష్‌నగర్‌లో అన్నసమారాధన ప్రారంభిస్తున్న నిర్వాహకులు



తాటితూరులో అన్నదానం ప్రారంభిస్తున్న భీమిలి ఎంపీపీ వాసురాజు తదితరులు

మధురవాడ: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం 5, 7 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో విశేషంగా అన్నసమారాధనలు నిర్వహించారు. గణేష్‌నగర్ విజయ గణపతి దేవాలయంలో సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 6 వేల మందికి అన్నదానం చేశారు. ధర్మకర్త నక్కాన సూర్యప్రకాశరావు, పెద్దలు గడ్డి శ్రీను, వంకాయల మారుతీ ప్రసాద్, బగాది లక్ష్మణ, కరణం రామ్మోహన నాయుడు, కూన రమణ, కొర్రాయి సురేష్ పాల్గొన్నారు.

● ఆదిత్యనగర్‌లో పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు తదితరులు నిర్వహిస్తున్న వేడుకల్లో 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, టీడీపీ నాయకుడు పిళ్లా వెంకటరావు, నాగోతి కుమార్‌రాజా అన్నసమారాధనను ప్రారంభించారు.

తగరపువలస: భీమిలి మండలం తాటితూరులో దొర యూత్ ఆధ్వర్యంలో అన్నదానాన్ని ఎంపీపీ దంతులూరి వాసురాజు ప్రారంభించారు. సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, ఎంపీటీసీ సభ్యులు ఉండబట్ల ఆదిలక్ష్మి, చిన్నారావు, చెల్లూరి నగేష్, కొయ్య శ్రీనివాసరెడ్డి, పతివాడ రాంబాబు, గోపిశెట్టి గోవిందరావు, దుంపల నాగమణి, ప్రభాకరరావు, మద్దిల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● టి.నగరపాలెం పంచాయతీ గొల్లలపాలెం, భీమిలి జోన్ ఒకటో వార్డు బాలాజీనగర్, చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయం, సంగివలస అనిట్స్ కళాశాల వద్ద కూడా భారీగా అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



ముచ్చర్లలో స్థానికులతో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జగదీశ్వరరావు

తగరపువలస : సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. ఆనందపురం మండలం ముచ్చర్లలో డయేరియా కేసులు వెలుగు చూసిన నేపథ్యంలో పంచాయతీలో సోమవారం ఆయన పర్యటించారు. వెంటనే వైద్య శిబిరం నిర్వహించాలని ఆనందపురం పీహెచ్‌సీ సిబ్బందిని ఆదేశించారు. ఎవరెవరికి డయేరియా సోకిందో తెలుసుకోవడానికి ఇంటింటా సర్వే చేయించారు. అయిదు కేసులను గుర్తించగా ఒకరు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా... నలుగురు చికిత్స పొంది డిశ్చార్జ్ అయినట్టు తెలిపారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ పంచాయితీ ప్రజలు పూర్తిగా కోలుకున్న వరకు స్థానికంగా వైద్య శిబిరం కొనసాగించాలన్నారు. అనంతరం ఆయన ఆనందపురం, మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకుంటున్న చర్యలు అడిగి తెలుసుకున్నారు. బీసీజీ, నేషనల్ డీ వార్మింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట ఎంపీఏఈవో నాగభూషణం తదితరులు ఉన్నారు.

దాడి చేయడంతోనే వాచ్‌మన్ మృతి

కొమ్మాది : యువకులు దాడి చేయడం వల్లే ఎండాడ సమీపంలో గల వివేకానందనగర్‌లోని ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న పొట్నూరు అప్పలరాజు (35) మృతి చెందాడని పోలీసులు నిర్ధారించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై సమీపంలో ఉన్న బంకుకు పెట్రోల్ కోసం అప్పలరాజు బయలుదేరాడు. అలా వెళ్లిన వ్యక్తి కాసేపటి తర్వాత బంకు వెనకాల గల ఓ బొటిక్ మెట్లపై మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఈ మృతిని ఆరిలోవ పోలీసులు అనుమానాస్పద మృతిగా నమోదు చేశారు. అప్పలరాజు భార్య భవాని మృతిపై అనుమానం ఉందని పోలీసులకు తెలపడంతో సోమవారం ఈ బొటిక్ వద్ద ఉన్న సీసీ కెమెరాల పుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. అప్పలరాజు ద్విచక్ర వాహనంపై ఎండాడ పెట్రోల్ బంక్ వైపు వెళ్తున్న మార్గ మధ్యలో... ఇద్దరు యువకులు మరో వాహనంపై వచ్చి అప్పలరాజు వాహనాన్ని అడ్డగించి దాడి చేసి పక్కకు నెట్టేయడంతో అప్పలరాజు క్రిందకు పడిపోయినట్లు పోలీసులు నిర్ధారించారు. దాడి చేసిన వ్యక్తులను పీఎం పాలెంకు చెందిన మనోజ్‌కుమార్, పెద్దవాల్తేరుకు చెందిన షణ్ముఖ్‌గా పోలీసులు గుర్తించారు. వీరు ఎందుకు దాడి చేశారనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు.

గురుకుల విద్యార్థికి మెడిసిన్ సీట్



గోపాలరావు

మధురవాడ: మారికవలసలోని ఏపీ గిరిజన గురుకుల శిక్షణ సంస్థ విద్యార్థి జి.గోపాలరావు మెడిసిన్‌లో సీటు సాధించాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఐటీడీఏ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థుల్లో 28 మంది నీట్-2024కు హాజరు కాగా.. వారిలో గోపాలరావు 482 మార్కులు సాధించాడు. ఎస్టీ కేటగిరిలో ఆలిండియా స్థాయిలో 3,658వ ర్యాంకు సాధించి మధురవాడ గాయత్రి మెడికల్ కళాశాలలో మెడిసిన్‌లో సీటు పొందాడు. హుకుంపేట మండలం ఈదురు గరువు గ్రామానికి చెందిన ప్రసాదరావు, లక్ష్మిల కుమారుడైన గోపాలరావు సాధారణ వ్యవసాయ కూలీ కుటుంబం నుంచి వచ్చి కార్డియాజిస్ట్ కావాలనే లక్ష్యంతో కష్టపడి చదివి సీటు సాధించాడు.

● చింతపల్లి మండలం పాత కిన్నెర్ల గ్రామంలోని ఆదిమ గిరిజన తెగకు చెందిన వ్యవసాయ కూలీలు పి.బంగార్రాజు, నీల్మల కుమారుడు పి.మత్యరాజు నీట్‌లో 384 మార్కులు సాధించి ఎస్టీ కేటగిరీలో ఆలిండియా స్థాయిలో 10,859వ ర్యాంకు సాధించాడు. వెటర్నరీ, బీడీఎస్‌ల్లో సీటు సాధించే అవకాశాలు ఉన్నాయని ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం విజేతలను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.